తాగునీటికి కటకట

- లీకేజీ అవుతున్న భగీరథ పైప్ లైన్
- అద్దె బోరే దిక్కు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న యాచారం, యాచారం తండా వాసులు



యాచారంలో అద్దె బోరు నుంచి వస్తున్న నీటిని పట్టుకుంటున్న గిరిజనులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని యాచారం, యాచారం తండాలో నీటిసమస్య నెలకొంది. భూగర్భ జలాలు అట్టడుగునకు చేరడంతో గొంతుతడుపుకోవడానికి గిరిజనులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సమీపంలోని వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ చేతిలో బిందెలు పట్టుకొని పరుగులు తీయాల్సిందే. గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంక్ ఉన్నప్పటికి భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు వాపోతున్నారు. రక్షిత మంచి నీటి ట్యాంక్‌కు సరఫరా అయ్యే బోరు నుంచి నీరు రాకపోవడంతో సమస్య తలెత్తుతుందని వారు పేర్కొంటున్నారు.

అద్దె బోరుకు నెలకు రూ.5 వేలు..

గ్రామానికి చెందిన ఓ రైతు బోరు నుంచి గ్రామస్తులకు నీటిని సరఫరా చేస్తున్నప్పటికి ఇబ్బందులు తప్పడం లేదు. బోరు నుంచి నీటిని ఇచ్చినందుకు నెలకు రూ.5వేలు ఇస్తామని గ్రామ పంచాయతీ అధికారులు సంబంధిత రైతుతో ఒప్పందం కుదుర్చుకుని నీటిని అందిస్తున్నారు. ఒకే బోరు నుంచి నీరు యాచారం, యాచారం తండాకు సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో ప్రజలు నీళ్ల కోసం గొడవలు పడుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి రాలేదని, ఈ సీజన్‌లోనే నీటికి గోస వచ్చిందని తండా వాసులు చెబుతున్నారు. ఊళ్లో ఉన్న బోర్లు అన్నీ ఎత్తిపోవడంతో ఈపరిస్థితి నెలకొందని తెలిపారు.

ఇంతగోస ఎప్పుడూ చూడలేం



నీళ్ల కోసం ఇటువంటి గోస ఎప్పుడు చూడలేం. మస్తు గోస ఐతుంది. ఈ కిరాయి బోరు దగ్గర నుంచి నీళ్లు తీసుకెళ్తున్నాం. నీళ్లు పట్టుకునేటప్పుడు గొడవలు జరుగుతున్నాయి. గుక్కెడు నీటి కోసం గోస పడాల్సి వస్తోంది. ఎండను లెక్క చేయకుండా నీళ్లను తెచ్చుకుంటున్నాం.

– మంజుల, యాచారం

భగీరథ నీళ్లు రావు



మా ఊరికి ఈ భగీరథ నీళ్లు ఎప్పుడు సక్కగా రావు. లీకేజీలు ఉన్నాయి. ఊళ్లో ఉన్న బోర్లు పోస్తలేవు. పొద్దున లేవంగానే బిందెలతో వరుసలో నిలబడి నీళ్లు మోసుకుపోవాలి. వరుస తప్పితే గొడవలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకుని నీటి సమస్య లేకుండా చూడాలి.

– సంతోష్, యాచారం

క్లుప్తంగా

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

బాన్సువాడ రూరల్: రక్తదానం చేయడంతో మరొకరికి ప్రాణదానం చేసినట్లు అని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ అన్నారు. ప్రతి 3 నెలలకు ఓసారి రక్తదానం చేయడాన్ని యువకులు హాబీగా మార్చుకోవాలని ఆయన సూచించారు. ఆదివారం బాన్సువాడ లోని మాతాశిశు ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల గుండెపోటు అవకాశాలు తగ్గుతాయని, బరువు తగ్గడంతోపాటు బీపీ అదుపులో ఉంటుందన్నారు. మాతాశిశు ఆస్పత్రిలో రక్తనిల్వలు తగ్గిపోవడంతో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుల శ్రీనివాస్, దర్శనం పర్వయ్య, వాగ్మారేశివశంకర్, పవన్‌కుమార్, బెజుగం శంకర్, సంతోష్, పవన్‌కుమార్, షేక్ ఖయ్యుం, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది ఆనంద్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేత



ప్రశంసపత్రాలను అందిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రశంస పత్రాలను అందించారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన పింకీబాయి, మానస, అంజలి, పావనిలకు ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రభాకర్ తదితరులున్నారు.

జాగృతి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా సంపత్‌గౌడ్



సంపత్‌గౌడ్

లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా ఎదురుగట్ల సంపత్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. తెలంగాణ జాగృతి సంస్థాగత నిర్వాహణలో భాగంగా సంస్థ బలోపేతానికి కృషి చేయడానికి, సంస్థ ఆశయ సాధనకు శక్తివంచన లేకుండా శ్రమించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఫస్టియర్‌లో అడ్మిషన్లకు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కమల్ కిషోర్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 26న మెరిట్ జాబితాను ప్రదర్శిస్తామన్నారు. 27నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల స్థానిక విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాడ్వాయిలో ఆర్ఎస్ఎస్ శాఖ



ప్రార్థన చేస్తున్న స్వయం సేవకులు

తాడ్వాయి: మండల కేంద్రంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలలు, యువకులకు దేశభక్తి గురించి వివరించడంతో పాటు వివిధ రకాల వ్యాయామాలు చేయించారు. ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులు వివరించారు. యువకులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, మంచిమార్గంలో నడవాలని సూచించారు.

నేడు విద్యుత్‌శాఖ కార్యాలయంలో ప్రజావాణి

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ విజయసారథి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేయాలనుకుంటే డీఈ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలి



మాందాపూర్ రైతు వేదికలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో రాజేశ్

బీబీపేట: మండలంలోని ఆయా క్లస్టర్ పరిధిలో ఉన్న రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని మాందాపూర్ ఏఈవో రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రైతువేదికలో రైతుల వివరాలు నమోదు చేశారు. మాందాపూర్, కోనాపూర్ రైతులకు సోమవారం చివరి తేదీ కాగా, జనగామ గ్రామ రైతులు జూన్ 5 వ తేదీ వరకు, మల్కాపూర్ రైతులు ఈ నెల 24వ తేదీ వరకు, తుజాల్‌పూర్ రైతులు 31వ తేదీ వరకు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు. ఆయా క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న వాలీబాల్ సమ్మర్‌క్యాంప్



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆవరణలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్ కొనసాగుతోంది. యువకులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళలో వాలీబాల్ ఆడుతున్నారు. చదువుతోపాటు ఆటలు ఆడడంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కోచ్ సాయికుమార్ పేర్కొన్నారు. ఈ క్యాంప్ ఈనెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు.

నిలిచిన ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులు



నిలిచిన మైలారం కల్యాణ మండపం పనులు

- నస్రుల్లాబాద్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారిన వైనం
- పూర్తి చేయాలని వేడుకోలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పేద, మధ్య తరగతి ప్రజల శుభకార్యాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణ మండపాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బాన్సువాడ నియోజకవర్గంలో నస్రుల్లాబాద్ మండలానికి నాలుగు ఫంక్షన్ హాళ్లను కేటాయించారు. మైలారం, బొమ్మన్‌దేవ్‌పల్లి, సంగం, దుర్కి గ్రామాల్లో కల్యాణ మండపాల పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. రేకుల షెడ్డును వేసి నిరుపయోగంగా వదిలేశారు. ప్రతి భవనానికి రూ.20లక్షలు కేటాయించినా పూర్తి స్థాయిలో పనులు పూర్తికాక నిలిచిపోయాయి.

గ్రామాలకు దూరంగా..

కల్యాణ మండపాలు ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయడంతో గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీంతో సాయంత్రం కాగానే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇలా మధ్యలోనే వదిలేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా రామాలయ మండపం..

నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో 2021లో రామాలయంలో కల్యాణ మండపం నిర్మించారు. ఆలయం ప్రాంగణంలో ఉండటంతో నాన్ వెజ్ వంటలకు ఇబ్బంది కావడంతో శుభకార్యాలు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు. గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టిన షాదీఖాన నిర్మాణ పనులు పునాదిస్థాయిలో నిలిచిపోయాయి.

పనులు పూర్తి చేయించాలి



మైలారంలో కల్యాణ మండపం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరుతున్నాం. శుభకార్యాలు చేసే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఊరట కలుగుతోంది.

– అల్లం రాము, మైలారం

ఆకతాయిలకు అడ్డాగా మారాయి



ఊరికి దూరంగా కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభించారు. అర్ధాంతరంగా పనులు నిలిచిపోవడంతో అవి ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఫంక్షన్ హాలు పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి.

– సాయిలు, బొమ్మన్‌దేవ్‌పల్లి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో బాధితులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. గ్రామానికి చెందిన కుర్మబాలయ్యకు రూ.65 వేలు, మాసుల సాయిలుకు రూ.25 వేల చెక్కులు మంజూరు కావడంతో నాయకులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గంగి. రమేష్‌యాదవ్, చింతకిందికాశయ్య, కోర మండల్ సాయాగౌడ్, కిష్టారెడ్డి తదితరులున్నారు.

శిథిలావస్థలో నీటిట్యాంకు



బాన్సువాడ రూరల్ : మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోయి, ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకును తొలగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అధికారులను గ్రామస్తులు కోరగా వారు రూ.2లక్షలు జమచేసి ఇస్తే తొలగిస్తామని బదులిచ్చినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి శిథి లావస్థకు చేరిన మంచినీటి ట్యాంకు తొలగించి కొత్తట్యాంకు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోధనకు సహకరించిన దాతలకు సన్మానం



దాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో ఇంగ్లిష్ విద్యబోధనకు సహకరించేందుకు ముందుకు వచ్చిన దాతలను ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలకు దీటుగా బోధన ఇంగ్లిష్‌లో నిర్వహించేందుకు అవసరమైన ముగ్గురు అనుభవజ్ఞులైన విద్యా వలంటీర్లను గ్రామస్తులు నియమించారు. ఏడాదికి అవసరమైన వేతనం వీరికి ఇచ్చేందుకు పలువురు దాతలు ముందుకు రావడంతో వీరందరిని సన్మానించారు. పాఠశాలలో విద్యార్థులు సంఖ్య 50 నుంచి 110కి పెరిగిందని గ్రామస్తులు తెలిపారు.

ప్రకృతివనంలో ఎండుతున్న చెట్లు



తాడ్వాయిలోని ప్రకృతివనంలో ఎండిన చెట్లు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలలో గల ప్రకృతివనాల్లో చెట్లు ఎండుతున్నాయి. ఎండలు పెరగడంతో తాడ్వాయి పల్లె ప్రకృతివనంలో చెట్లు 70శాతం ఎండిపోయాయి. కొన్ని గ్రామాలలో ప్రకృతి వనాలు మద్యం ప్రియులకు అడ్డాగా మారాయి. అధికారులు పట్టించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



కోటాల్‌పల్లిలో ఐకేపీ సిబ్బందిని అభినందిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం కోటాల్‌పల్లి, లింగాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ముగిసినట్లు కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మిరాజాగౌడ్ తెలిపారు. ఇప్పటి వరకు తొమ్మిది వేల రెండు వందల 97 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం రెండు గ్రామాలకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో ఐకేపీ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కిషన్ గౌడ్, జోనకంటి మంజుల బాలయ్య, ఉపసర్పంచ్ రాజయ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు విజయ, ఐకేపీ సిబ్బంది సీసీ విశ్వనాథం వీవోఏ రాజలింగం, సంగీత, ఎస్‌బికే యాదిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రాజంపేట : మండలంలోని పొందుర్తి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈపోటీల్లో 30 టీంలు పాల్గొంటున్నట్లు, వచ్చేనెల 6వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. ఈపోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి నరేందర్ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు సంపత్ రెడ్డి జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరీ దేవిరెడ్డి, గంగారెడ్డి, పొందుర్తి గ్రామ అధ్యక్షులు కుమ్మరి రమేష్, నర్సింలు, ఉమా శంకర్ కృష్ణ ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.



పొందుర్తిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కుంట లక్ష్మారెడ్డి

వాసవి క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

బీబీపేట: అంతర్జాతీయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 25 సంవత్సరాలు (సిల్వర్ జూబ్లీ) పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం యాదగిరి గుట్టలో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా బీబీపేట వాసవి క్లబ్ సభ్యులను అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్నటువంటి స్వచ్ఛంద కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తోడుపునూరి నాగభూషణం, బాశెట్టి నాగేశ్వర్, తాటిపల్లి రమేష్, దుద్దెల విశ్వప్రసాద్, ఎర్రం ప్రసాద్, బాశెట్టి వెంకటేశం, ఎర్రం ప్రసాద్, ఉప్పల మనోజ్, నీలా భైరయ్య, బచ్చు రామచంద్ర, రెడ్డిశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రేణుక ఎల్లమ్మ నాటకం



పెద్ద ఎక్లారలో నిర్వహించిన ఎల్లమ్మ నాటకంలోని పాత్రధారులు

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లార గ్రామంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ నాటకం, జీవిత చరిత్ర ఆదివారంతో ముగిసింది. గ్రామస్తుల కోరికమేరకు గ్రామానికి చెందిన కుర్మ అంజయ్య, నారాయణ, గంగారం, గణపతిలు ఈ నాటకం ఏర్పాటు చేశారు. ఎల్లమ్మ నాటకంలోని పాత్రదారులు తమ నటనతో చూపరులను మెప్పించారు. ఈకార్యక్రమంలో నాటకం పాత్రధారులు కుమ్మరి భోజు, ఆనంద్, నాగేశ్, గంగాధర్, యాదవ్‌రావ్, తెనుగు నాగు, సాయన్న, రాజన్న తదితరులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామశివారులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం హోమం నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా వారంరోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయం ఎదుట వేదమంత్రాల మధ్య హోమం నిర్వహించగా, దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు ఊరేగింపు



బోనాలతో వెళ్తున్న మహిళలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు దుర్గమ్మ, పోచమ్మలకు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బోనాలు తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో వైభవంగా బోనాలు ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన మడివేలి మాచయ్య స్వామి ఆలయ ఉత్సవాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

భిక్కనూరు: మండలకేంద్రంలో మడివేలి మాచయ్యస్వామి శీతాలమ్మ ఆలయం తొమ్మిదవ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు. సోమవారం మడివేలు మాచయ్య స్వామి శీతాలమ్మల కల్యాణం నిర్వహిస్తామని, సాయంత్రం అమ్మవారికి బోనాలను సమర్పిస్తామని రజక సంఘం ప్రతినిధులు తెలిపారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఇందులో భాగంగా అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.